

పెద్దిరెడ్డా.. మజాకా

84 వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల్లో సుమారు 30 వేల ఎకరాలు.. 6939 ఎకరాల 22ఏ క్లియరెన్స్ భూముల్లో 3 వేలకుపైగా పుంగనూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. తద్వారా మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు ఈ భూముల వ్యవహారంలో భారీ ఎత్తున లాభపడ్డారు. ఈ మొత్తం వ్యవహారాన్ని జిల్లా అధికారులు మళ్లీ సమీక్షించనున్నారు.



మీరూ అలాగే చేయండి

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పు ఘటన నేపథ్యంలో జిల్లాలో ఐదేళ్ల భూబాగోతం వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెండు రోజుల్లో సేకరించారు. గురువారం మదనపల్లెలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ నివేదిక అందించారు. చిత్తూరు జిల్లా టీమ్ తయారుచేసిన భూ లావాదేవీల సమాచారం బాగుందని, మిగిలిన వారూ ఇలాగే సిద్ధం చేసుకోవాలని సిసోడియా అభినందించారు.

రెవెన్యూ మెడపై కత్తి పెట్టి..!

ఐదేళ్ల వైసీపీ పాలనలో కొందరు రెవెన్యూ అధికారులు నలిగిపోయారు. మరికొందరు తమపై ముద్ర వేసుకుని మరీ వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. వైసీపీ నాయకులు ఆయా అసైన్డ్ భూముల్ని ఫ్రీహోల్డ్ కింద మార్చేందుకు రెవెన్యూ అధికారుల మెడపై కత్తి పెట్టి మరీ పనులు చేయించుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఏకంగా 1.75 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల్ని ఫ్రీహోల్డ్ కింద మార్చుకోవాలని వైసీపీ నేతలు క్షేత్ర స్థాయి రెవెన్యూ సిబ్బంది నుంచి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో జిల్లా అధికారులు 84 వేల ఎకరాలకు లైన్ క్లియర్ చేశారు. మిగిలిన ప్రతిపాదనల్ని తిరస్కరించారు. అలాగే 6939 ఎకరాల్ని 22ఏ జాబితా నుంచి తొలగించారు. ఇలా ఐదేళ్లలో తమకు అనుకూలంగా వైసీపీ నేతలు భూ వ్యవహారాలు నడిపారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- 1.75 లక్షల ఎకరాల్ని ఫ్రీహోల్డ్ చేసేలా ఒత్తిళ్లు
- ఫైనల్‌గా 84 వేల ఎకరాలకు లైన్ క్లియర్
- పుంగనూరు నియోజకవర్గంలోనే 30 వేల ఎకరాలకు..
- 22ఏ నుంచి 6939 ఎకరాల తొలగింపు
- అందులోనూ 3030 ఎకరాలు పుంగనూరులోనే
- ఫ్రీహోల్డ్ రికార్డులన్నీ మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు

ఫ్రీహోల్డ్, '22ఏ తొలగింపు' భూములిలా..

- జిల్లాలో 1,75,197 ఎకరాల అసైన్డ్, ఎక్స్ సర్వీస్ మెన్, డాటెడ్, ఎండోమెంట్ ల్యాండ్స్‌ను ఫ్రీహోల్డ్ కింద క్లియరెన్సు ఇవ్వాలని క్షేత్ర స్థాయి వీఆర్వో, ఎమ్మార్వో వంటి అధికారుల నుంచి జిల్లా అధికారులకు నివేదికలు అందాయి. సరైన రికార్డులు లేని 82,408 ఎకరాల్ని వివాదాస్పద భూములుగా మార్చారు. 8410 ఎకరాలకు క్లియరెన్స్ ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. 84,378 ఎకరాలకు మాత్రం ఫ్రీహోల్డ్ కింద మార్చారు.
- అలాగే ఐదేళ్లలో 6939 ఎకరాల్ని 22ఏ జాబితా నుంచి తొలగించారు. 2019లో 76.4 ఎకరాలు, 2020లో 181.2, 2021లో 87.5, 2024లో ఇప్పటివరకు 86.5 ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగించగా.. 2022లో ఏకంగా 3717.7 ఎకరాల్ని, 2023లో 2789 ఎకరాల్ని నిషేధిత జాబితా నుంచి తొలగించారు.

పుంగనూరులో 30 వేల ఎకరాలు ఫ్రీహోల్డ్

జిల్లా వ్యాప్తంగా 84378 ఎకరాల అసైన్డ్ భూముల్ని ఫ్రీహోల్డ్ కిందికి మార్చగా.. వీటిలో ఒక్క పుంగనూరు నియోజకవర్గంలోనే 29424 ఎకరాలున్నాయి. అంటే జిల్లా మొత్తంగా 35 శాతం భూముల క్లియరెన్సు ఒక్క పుంగనూరులోనే జరిగింది. సోమలలో 7601, పుంగనూరులో 5557, చౌడేపల్లెలో 5095, సదుంలో 4696, రొంపిచెర్లలో 3925, పులిచెర్లలో 2550 ఎకరాలకు లైన్ క్లియర్ చేసుకున్నారు. ఈ మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో జిల్లా అధికారులు సగం క్లియర్ చేస్తేనే ఈ స్థాయిలో లబ్ధి చేకూరింది. మొత్తం చేసి ఉంటే 30 వేల ఎకరాలు కాస్త 50 వేల ఎకరాలుగా మారి ఉంటాయి.

కుప్పంలో నామమాత్రం..

కుప్పం నియోజకవర్గంలో ఫ్రీహోల్డ్ కింద మార్చిన అసైన్డ్ భూముల జాబితాను పరిశీలిస్తే.. ఆశ్చర్యపోతారు. ఒక్క పుంగనూరులోనే 30 వేల ఎకరాల్ని మారిస్తే.. కుప్పంలో మాత్రం 8936 ఎకరాల్ని మాత్రమే మార్చారు. గుడుపల్లెలో 245, శాంతిపురంలో 580.8, కుప్పంలో 982, రామకుప్పంలో 7128 ఎకరాల్ని ఫ్రీహోల్డ్ చేశారు. కుప్పంలో 9049 ఎకరాల కోసం క్షేత్ర స్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే.. జిల్లా స్థాయిలో 928 ఎకరాలకు మాత్రమే క్లియరెన్సు దక్కింది.

'22ఏ జాబితా'లోనూ పుంగనూరుకే ప్రాధాన్యం

ఇక 22ఏ జాబితా నుంచి తొలగించిన భూముల విషయానికొస్తే.. ఇక్కడా పుంగనూరు నియోజకవర్గానికే పెద్ద మేలు జరిగింది. జిల్లా వ్యాప్తంగా 6939 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించగా.. ఒక్క పుంగనూరులోనే 3030 ఎకరాలున్నాయి. రొంపిచెర్లలో 1938, పుంగనూరులో 998, పులిచెర్లలో 54, సదుంలో 30.50, చౌడేపల్లెలో 9.50 ఎకరాల్ని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఇక్కడా కుప్పం నియోజకవర్గానికి అన్యాయం జరిగింది. శాంతిపురం మండలంలో 2 ఎకరాలు, కుప్పంలో 21, గుడుపల్లెలో 24, రామకుప్పంలో 211 ఎకరాల్ని మాత్రమే 22ఏ జాబితా నుంచి తొలగించారు.

ఫ్రీహోల్డ్ భూములపై పునఃవిచారణ

జిల్లాలో 1,75,197 ఎకరాల అసైన్డ్ భూముల్ని ఫ్రీహోల్డ్ కింద మార్చమని మండలాల నుంచి ప్రతిపాదనలు వస్తే.. 82,408 ఎకరాల్ని వివాదాస్పద భూములుగా మార్చారు. 8410 ఎకరాలకు ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఫ్రీహోల్డ్ కింద మార్చిన 84378 ఎకరాల భూముల జాబితాను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పునఃవిచారణ చేయనున్నారు. దీంతో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 84 వేల ఎకరాలు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పు ఘటన నేపథ్యంలో.. ఈ పునఃవిచారణ అంశం తెరపైకి వచ్చింది.

పోటెత్తిన పెద్దిరెడ్డి భూబాధితులు

- స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు వందల సంఖ్యలో ఫిర్యాదులు
- ధైర్యంగా ముందుకొచ్చి బాధ వెళ్లగక్కిన బాధితులు



భూవివాదాలపై సిసోడియాకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, జూలై 25: మా భూమిని ఆక్రమించేశారు. మా స్థలాన్ని కబ్జా చేశారు. ప్రాజెక్టు కోసం మా భూములు బలవంతంగా లాక్కున్నారు. ప్రశ్నిస్తే నడిరోడ్డు మీద ఆడవారు అని కూడా చూడకుండా కొట్టారు.

.. ఇలా ఒకటా రెండా వందల సంఖ్యలో పెద్దిరెడ్డి కుటుంబ బాధితులు మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో తమ గోడు వెళ్లబోసుకున్నారు. గురువారం రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఆధ్వర్యంలో భూవివాదాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ కార్యక్రమం వర్షం కారణంగా ఆలస్యమైనా, తడుస్తూనే బాధితులు క్యూలో నిలబడి తమ ఫిర్యాదులు, అర్జీలు అందజేశారు. వీరిలో ఎక్కువగా పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల వాళ్లున్నారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వారి అనుచరులైన వైసీపీ సర్పంచులు, ఎంపీపీల అరాచకాలను బాధితులు బయటపెట్టారు. ప్రభుత్వం మారడంతో తమ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడానికి ఇదే సమయమని ధైర్యంగా సిసోడియా సార్‌కు కంప్లైంట్ ఇవ్వడానికి వచ్చామని బాధితులు చెప్పారు. వందలాదిగా వచ్చిన ప్రజల నుంచి భూవివాదాలు, ఇతర సమస్యలపై రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ అర్జీలు స్వీకరించి, బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. వీటిపై విచారించి నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపుతామని బాధితులకు భరోసా ఇచ్చారు.

నడిరోడ్డులో కొట్టారు



మాది ములకలచెరువు. 2014లో జన్మభూమి కార్యక్రమంలో టీడీపీ ప్రభుత్వం 1.5 సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేసింది. ఆ స్థలాన్ని చదును చేయించి, ఇటుకలు, ఇసుక తోలిపెట్టాను. ఆర్థిక స్థితి సరిగ్గా లేక ఇంటి నిర్మాణం చేయలేకపోయాను. వైసీపీ ప్రభుత్వం వస్తూనే ఆ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తుంటే అడ్డు చెప్పా. అంతే వైసీపీ నాయకులు వచ్చి నన్ను, నా బిడ్డలను నడిరోడ్డుపై కొట్టారు. అదేమని ఎదురుతిరిగితే తప్పుడు కేసులు పెడతామని బెదిరించారు. ఇప్పటికైనా మాకు న్యాయం జరుగుతుందని సిసోడియా సార్‌కు అర్జీ ఇచ్చేందుకు వచ్చా.

- తలారి సునీత, ములకలచెరువు

భూమి అమ్మలేదని శ్మశానంగా మార్చేశారు



నేను ట్రాన్స్‌కోలో లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నా. సీటీఎం క్రాస్ రోడ్డులో ఎకరాకు పైగా భూమి కొన్నా. ఈ భూమి చుట్టూ కంచె వేసుకుంటే చూసిన ఇద్దరు వైసీపీ సర్పంచులు ఆ భూమిని వారికి అమ్మాలని బలవంతం చేశారు. నేను ఇవ్వనని తిరగబడితే, నా భూమిలో ఊర్లో మృతి చెందిన వారి శవాలను పాతి పెట్టించి శ్మశానం చేస్తున్నారు. అప్పట్లోనే మంత్రి, ఎంపీ పేర్లు చెప్పి ఉద్యోగం తీయించేస్తామని బెదిరించారు. ఇప్పటిపైనా నాకు న్యాయం జరుగుతుందని ఫిర్యాదు చేసేందుకు వచ్చా.

- ఎ.ఏసువర్ధన్, ట్రాన్స్‌కో ఉద్యోగి, మదనపల్లె

హైకోర్టు తీర్పు ఇచ్చినా కబ్జా చేసేశారు



మాకు పుంగనూరు టౌన్, ఎంబీటీ రోడ్డులో లాడ్జి పక్కన సర్వే నెంబర్ 16/96లో ఖాళీ జాగా విషయమై హైకోర్టులో కేసు నడిచింది. మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయినా మాజీమంత్రి పెద్దిరెడ్డి అనుచరులు దౌర్జన్యంగా మా జాగాను కబ్జా చేసి రోడ్డు వేసేశారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసినా మాకు న్యాయం జరగలేదు. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశగా వచ్చాం.

- పబ్బితి ఉష, పుంగనూరు.

మా భూములు బలవంతంగా లాక్కున్నారు



పుంగనూరు మండలం నేతిగుంటపల్లె ప్రాజెక్టు కోసం మా గ్రామస్థుల వందలాది ఎకరాల భూములు లాక్కున్నారు. మూడేళ్లయినా డబ్బులు ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు ఓట్లేయండి భూమి డబ్బులు ఇప్పిస్తాం, లేకుంటే రావని పెద్దిరెడ్డి అనుచరులు బెదిరించారు. రైతులను పూర్తిగా మోసం చేశారు. పంట పండే భూముల్లో మన్ను ఎత్తేసి కట్టలు కట్టేశారు. పెద్దపెద్ద టవర్లు పాతి మా భూములు ఎందుకూ పనికిరాకుండా చేశారు.

- వెంకటరమణ, రైతు, నేతిగుంటపల్లె, పుంగనూరు మండలం

మాపై తప్పుడు కేసులు ఎత్తివేయండి

- సీఎం చంద్రబాబును కలిసిన 'ఆవులపల్లె ప్రాజెక్టు' బాధిత రైతులు
- పీఎల్ఆర్ కంపెనీ చిత్రహింసలు పెట్టిందని ఆవేదన
- సీతమ్మ చెరువుకట్టను పునర్నిర్మించాలని వినతి



పుంగనూరు, జూలై 25: రైతులకు నష్టం జరిగేలా, నిబంధనలకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం ఆవులపల్లె ప్రాజెక్టు పనులు చేపట్టింది. దీనికి అభ్యంతరం చెప్పిన మాపై క్రిమినల్, అటవీ చట్టాల కింద తప్పుడు కేసులు పెట్టారు. వీటిని ఎత్తేయండి' అంటూ బాధిత రైతులు సీఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమల మండలం ఆవులపల్లె ప్రాజెక్టు నిర్వాసిత రైతులు సోంపల్లె లక్ష్మీపతినాయుడు, గుత్తా గుణశేఖర్‌నాయుడు, బి.చంద్రాచారి, ఎస్.యాదవనాయుడు, పి.తేజ, ఎం.రమణమూర్తి గురువారం వెలగపూడిలోని సీఎం కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. పీఎల్ఆర్ ప్రాజెక్ట్ కంపెనీ తమను చిత్రహింసలు పెట్టి అక్రమకేసులు బనాయించి వేధించిందని వివరించారు. ఆవులపల్లె తదితర ప్రాంతాల రైతులకు నష్టం కలిగేలా.. కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై తాము అభ్యంతరం తెలిపామన్నారు. దీనిపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, ఎన్జీటీకి, న్యాయస్థానాలకు ఫిర్యాదులు చేశామని గుర్తుచేశారు. తాము ఫిర్యాదులు చేయగానే కాంట్రాక్టర్ కోసం రెవెన్యూ అధికారులు వేధించడం ప్రారంభించారని, 40 ఏళ్లగా కొనుగోలుచేసి సాగులో ఉన్న భూమిని ప్రభుత్వ భూమి అంటూ వారంలో సరెండర్ చేయాలని నోటీసులు ఇచ్చారన్నారు. గత నాలుగేళ్లగా పీఎల్ఆర్ కంపెనీ రైతులపై క్రిమినల్, రెవెన్యూ, ఫారెస్టు సెక్షన్లతో అనేక తప్పుడు కేసులు పెట్టిందన్నారు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసులు ఉపసంహరించుకుకోవాలని, తప్పుడు కేసులు ఎత్తివేయాలని కోరారు. ఆవులపల్లె ప్రాజెక్టు కోసం 2020 సెప్టెంబరు 2వ తేది జారీ చేసిన జీవోఆర్టీ నెంబరు 461 రద్దు చేసి ప్రస్తుతం ధ్వంసమైన సీతమ్మచెరువును పునర్నిరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారించి అక్రమ కేసుల నుంచి ఉపశమనం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

రికార్డులు భద్రపరచడంలో నిర్లక్ష్యం తగదు

- ఉమ్మడి జిల్లా తహసీల్దార్లకు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హెచ్చరిక



మదనపల్లె టౌన్, జూలై 25: రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తూనే రికార్డుల నిర్వహణలో శ్రద్ధ చూపాలని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా ఆదేశించారు. మదనపల్లెలోని సబ్‌కలెక్టరేట్‌లో గురువారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 60 మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికార్డులను భద్రపరచడంలో నిర్లక్ష్యం చేస్తే దానికి బాధ్యులవుతారని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అధికారులు వారి పరిధిలోని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతుల అనుభవంలో భూమి ఉన్నా 20 ఏళ్లు కాకుండానే డీకేటీ పట్టా ఇవ్వరాదన్నారు. ఇలాంటివి ఇప్పటికే మంజూరై ఉంటే సర్వే చేయించాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన 22(ఏ) భూసమస్యలు, గత ఏడాది నిర్వహించిన పట్టా భూముల వివరాలు, ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియ, చుక్కల భూముల వివరాలు, అసైన్‌మెంట్ భూముల సమస్యలను ఆయా ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాకే సమస్య పరిష్కరించాలన్నారు. ఈ అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు శ్రీధర్, సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కుప్పం రెస్కోలో సర్వర్ డౌన్!

- మూడు రోజులుగా ఇదే తీరు
- గత ప్రభుత్వ 'అవినీతి' చెరిపేయడానికేనన్న అనుమానం

కుప్పం రెస్కోలో గత ప్రభుత్వ అవినీతి కార్యకలాపాల రికార్డులు చెరిపేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయా? అందుకు సహకార శాఖ.. రెస్కో అధికారులు కలిసి ప్లాన్ చేశారా? ఇప్పటికే జరుగుతున్న విచారణను తప్పుదారి పట్టించడానికి పన్నాగం పన్నారా? రెస్కోలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం ఇస్తున్నాయి.

- కుప్పం



కుప్పం రెస్కోలో మూడు రోజులుగా సర్వర్ డౌన్ అయిందని అధికారులు హడావుడి చేస్తున్నారు. సిస్టమ్స్ ముందు ఉద్యోగులు కూర్చుని ఏవేవో రిపేర్లు చేస్తున్నారు. అప్పుడప్పుడూ బయటి వ్యక్తులూ కార్యాలయంలో కనిపిస్తున్నారు. రెస్కోలో సర్వర్ పనిచేయడంలేదన్న విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం మారినప్పటినుంచీ రెస్కోలో గత పాలకులు, అధికారులు కుమ్మక్కై సాగించిన అవినీతి చర్యలు ఒకటొకటే బయపడుతున్నాయి. 121 మంది ఉద్యోగుల అక్రమ నియామకాల విషయం బహిరంగ చర్చనీయాంశమైంది. ఇక, వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండరు పిలవకుండానే అస్మదీయ కంపెనీలనుంచి అధిక ధరలకు మెటీరియల్ కొనడం.. అక్రమ పదోన్నతులు, వాహనాల నిర్వహణ, డీజీలు ఖర్చులూ తప్పుడు లెక్కలు చూపారు. ఇప్పుడు విచారణ మొదలైంది. సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి విచారణాధికారి హోదాలో ఈనెల 18న రెస్కో కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించి, ఉద్యోగులను విచారించి ప్రాథమిక విచారణ జరిపారు. మళ్లీ వారం తర్వాత వస్తానని చెప్పారు. ఈ క్రమంలో రెస్కో కార్యాలయంలో మూడునాలుగు రోజులుగా నాటకీయంగా సర్వర్ డౌన్ కావడం, సిస్టమ్స్ పనిచేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన సమాచారం చెరిపేసుందుకే అందులో భాగస్వాములైన రెస్కో అధికారులు, కొంతమంది ఉద్యోగులు కలిసి సర్వర్ డౌన్ అనే నాటకం ఆడుతున్నారని ఆ సంస్థ ఉద్యోగులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విచారణకు వచ్చిన శ్రీలక్ష్మికి ఈ రికార్డులు ఇచ్చారో, ఇంకా సిస్టమ్స్‌లో ఎంత సమాచారం నిక్షిప్తమై ఉందో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెస్కో అవినీతిపై మరింత శ్రద్ధపెట్టి, విచారణను వేగవంతం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు తగులబడినట్లు ఇక్కడా సర్వర్ డౌన్ పేరుతో ఎంత మేర సిస్టమ్స్‌నుంచి సమాచారం ఎరేజ్ అయిందో కూడా లెక్క తేల్చాల్సిన అవసరం ఉంది. సర్వర్ డౌన్ కావడంపై రెస్కో ఎండీ సోమశేఖర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మూడు రోజులనుంచి సర్వర్ డౌన్ కావడం వాస్తవమేనని చెప్పారు. ఏదో హార్డ్ డిస్క్ ప్రాబ్లమ్ వల్ల ఇలా జరిగిందన్నారు. అవినీతికి సంబంధించిన సమాచారం ఎరేజ్ చేయడానికి కుట్ర జరుగుతున్నదో లేదో తనకు తెలియదని చెప్పారు.

ఆ 17 మంది విషయంలో ఎందుకలా?

రెస్కోలో 121 అక్రమ నియామకాలకని తెరపైకి వచ్చింది. నిజానికి ఎన్నికలకు ముందుగా నియామకమైన ఉద్యోగులు 104 మంది మాత్రమే. అప్పట్లో వైసీపీ పాలకులతో కలిసి లక్షల ముడుపులు తీసుకుని ఉద్యోగాలిచ్చిన అధికారులే ఇప్పుడూ కొనసాగుతున్నారు. వీరు ఒక కిరికిరి చేశారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఓచర్ వేతనాల చెల్లింపుల ద్వారా నేరుగా ఉద్యోగాలు పొంది, తర్వాత పర్మనెంటు అయి, పదోన్నతులు కూడా పొందిన 17 మందినీ అక్రమ నియామక జాబితాలో చేర్చి ఆ సంఖ్యను 121 చేశారు. ఈ 17 మంది 2014 నుంచి 2016 వరకు టీడీపీ హయాంలో వేతనాలు లేకుండా పనిచేశారు. ఆ తర్వాత వీరికి ప్రభుత్వం వేతనాలు ఇచ్చింది. సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి ఇటీవల విచారణకు వచ్చిన సమయంలో ఈ 17 మంది ఉద్యోగులను ఆ జాబితానుంచి విడదీసి ప్రత్యేక కేసుగా పరిగణించాలని సూచించినట్లు తెలిసింది. అయినా అధికారులు మొండిగా వారిని ఆ జాబితాలోనే ఉంచేసి అందరితో పాటూ వీరికీ నోటీసులు జారీ చేయడానికి చూస్తున్నారు. ఇలా చేయడంవల్ల టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ అక్రమ నియామకాలు జరిగిందని దొడ్డిదారిన నిరూపించడానికి రెస్కో, సహకార శాఖాధికారులు తెగిస్తున్నారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న జేసీ శ్రీనివాసులు కానీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కానీ ఎందుకో ఈ అంశంపై పట్టీపట్టనట్లు ఊరుకుంటున్నారు.

మీరు డబ్బు డిపాజిట్ చేయండి.
30 రోజుల్లో రెండింతలు పొందండి.

.. ఇదీ డాయ్ యాప్ పేరిట సాగిన ప్రచారం. ఏజెంట్ల ద్వారా డబ్బులు సేకరించారు. వారి సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. యాప్‌ను ఓపెన్ చేయగానే అందులోని తమ వ్యాలెట్‌లో నగదు కనిపించడం చూసి నమ్మారు. చివరకు సెల్‌ఫోన్లలో ఆ యాప్ కనిపించకపోవడంతో పలమనేరులోని బాధితులు లబోదిబోమంటున్నారు. గతంలో ఇలాంటి మోసాలు సంస్థల తరపున జరగ్గా ఇప్పుడు యాప్‌ను తీసుకొచ్చారు.

- పలమనేరు

ఆశపెట్టి.. మోసగించి



- డిపాజిట్లపై రెండింతలు చెల్లిస్తామంటూ ప్రచారం
- రూ.వంద కోట్లకుపైగా కుచ్చుటోపీ
- పలమనేరులో 'డాయ్ యాప్' కలకలం
- లబోదిబోమంటూ డీఎస్పీ కార్యాలయానికి పరుగుతీసిన బాధితులు



తన కార్యాలయం ముందు గుమికూడిన డాయ్ యాప్ బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ

పలమనేరులో గురువారం 'డాయ్ యాప్' మోసం కలకలం సృష్టించింది. ఐదారు నెలలుగా గుట్టు చప్పుడు కాకుండా రూ.వంద కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించిన ఈ యాప్.. ఒక్కసారిగా సెల్‌ఫోన్లలో కనిపించక పోవడంతో వందలాది మంది బాధితులు డీఎస్పీ కార్యాలయానికి చేరుకోవడంతో ఈ మోసం వెలుగు చూసింది. ఈ డాయ్ యాప్‌ను మెప్మాలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ ప్రజల్లోకి తీసుకొచ్చారు. మెప్మాలో పనిచేసే పలువురు ఆర్.పి.ల ద్వారా స్వయం సహాయక సంఘ మహిళలు, వారి కుటుంబీకులు, బంధువర్గాలను ఇందులోకి లాగారు. డాయ్ యాప్‌లో డిపాజిట్లు కట్టించారు. ప్రతి పది మంది వద్ద డిపాజిట్లు కట్టించేవారికి ఆశాజనకంగా కమీషన్లు అందించారు. నెలసరి జీతాలూ ఉంటాయని నమ్మించారు. దీంతో ఎందరో ఏజెంట్లుగా మారి డబ్బులు కట్టించారు. 30 రోజులకే రెండింతలు వస్తుందన్న ఆశతో జనమూ యాప్ వలలో పడ్డారు. రూ.వేలల్లో నుంచి రూ.ఐదు లక్షల వరకు పలువురు జమ చేశారు. తాము కట్టిన డబ్బులు మూడో రోజుకే ఆయా వ్యక్తులకు జమ చేసినట్లు డాయ్ యాప్‌లోని వారి ఖాతాలో చూపారు. అంటే.. గడువు తీరాక బ్యాంకు ఖాతాలోకి విత్‌డ్రా చేసుకోవచ్చని నిర్వాహకులు చెప్పారట. ప్రతి రోజూ డబ్బులు డాయ్ యాప్‌లో కనిపిస్తుండటంతో ప్రజలు బాగా నమ్మేశారు. ఇందులో తొలుత కట్టిన వారికి కొంతమేర డబ్బులు వచ్చాయి. ఇదంతా ఆ నోట.. ఈ నోట విని మరికొందరూ అప్పుచేసి కట్టారు. 'ఇలా డిపాజిట్లు చేసిన వారిలో పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులూ ఉన్నారు. అందువల్లే మేమంతా దీనిని నమ్మి మోసపోయాం' అని కొందరు బాధితులు వాపోయారు. కాగా, డీఎస్పీ విష్ణురఘువీర్ కార్యాలయం నుంచి వెలుపలకు వచ్చి బాధితుల గోడు విన్నారు. డబ్బు చెల్లించే ముందు ఎవరైనా లిఖిత పూర్వకంగా గ్యారెంటీ ఇచ్చారా అని బాధితులను ప్రశ్నించగా.. అలాంటిది లేదన్నారు. తామంతా మెప్మా రాజేష్, ఆర్‌పీలు చెప్పిన మాటలు విని డబ్బు చెల్లించామని చెప్పారు. ఒక నెలలో రెట్టింపు డబ్బులు ఎలా చెల్లిస్తారని ఆలోచించకుండా అత్యాశకు పోయారని, ఇకపై ఇలాంటి యాప్‌ల బారిన పడి మోసపోవద్దని హెచ్చరించారు. వివరంగా ఫిర్యాదులు ఇస్తే కేసు దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, తాము మోసపోయిన విషయం బయటకు చెప్పుకోలేని వాళ్లెందరో ఉన్నారు. మొత్తమ్మీద యాప్ పేరిట రూ.వంద కోట్ల మోసం జరిగినట్లు తెలిసింది.

బాధితుల గోడు

రూ.3.5 లక్షలు నష్టపోయా



తొలుత రూ.రెండు లక్షలు కట్టాను. రోజూ కొంత డబ్బు వచ్చేది. ఇలా వచ్చే బోనస్‌కు ఆశపడ్డా. మళ్లీ మరో రూ.లక్ష కట్టాను. మళ్లీ మరో నెంబరు పేరుతో రూ.59 వేలు కట్టాను. ఇలా దాదాపు రూ.3.50 లక్షలు నష్టపోయా.

- లోకేష్‌కుమార్

ఈ నీళ్ల బాటిల్ ఇచ్చారు



మెప్మా రాజేష్ సార్ మీటింగ్ పెట్టి ఆర్.పి.ల ద్వారా అందరి వద్ద డబ్బులు కట్టించారు. తొలుత డబ్బు చెల్లించిన వారికి ప్రోత్సాహకంగా నీళ్ల బాటిళ్లు ఇచ్చారు. దీంతో మేమంతా నమ్మి డబ్బు కట్టాం. ఇకముందు ఎవరూ ఇలాంటి వాటిని నమ్మొద్దు.

- బుజ్జమ్మ

పక్కన వాళ్లను చూసి నేనూ కట్టా



మా ఇంటి పరిసరాల్లోని మహిళలు బంగారు తాకట్టు పెట్టి డబ్బులు కట్టారు. ఉద్యోగులు కూడా డిపాజిట్లు చేయడంతో నేనూ నమ్మి 15వేలు చెల్లించా. భర్తలకు తెలియకుండా వేలాది మహిళలు డబ్బులు కట్టారు. ఈ విషయం ఇంట్లో తెలిస్తే గొడవలవుతాయని బయటకు రాలేదు.

- షామీర్, గంటావూరు



ఎక్కుమందితో డబ్బులు కట్టించిన ఏజెంట్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న మెప్మా రాజేష్ (ఫైల్ ఫొటో)

రూ.లక్ష చెల్లించి మోసపోయా



నాకు ఉద్యోగం లేదు. డబ్బుకు ఆశపడి దాదాపు లక్ష రూపాయలు చెల్లించి మోసపోయాను. నేను డబ్బులు సంపాదిస్తున్నానని భావించి నన్నుచూసి చాలామంది డబ్బులు కట్టారు. వాళ్లూ మోసపోయారు.

- నవాజ్

అంతా రాజేష్ చేశాడు



డాయ్ యాప్‌కు సూత్రధారి మున్సిపాలిటీలో పనిచేసే మెప్మా రాజేష్. మేమంతా మోసపోవడానికి అతడితో పాటు కొంతమంది ఆర్.పీలు కారణం.

- బాబు

నగలు కుదువపెట్టి..



నేను ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నా. గొబ్బిళ్లకోటూరుకు చెందిన నా స్నేహితుడు డబ్బులు కట్టాడు. నెలరోజుల్లో రెట్టింపు డబ్బులు వస్తాయని నేనూ నగలు కుదువపెట్టి రూ.40 వేలు కట్టినా. సెల్‌ఫోనులో యాప్ కనిపించక పోవడంతో మోసపోయానని గుర్తించా.

- రాజన్న

12 కిలోల మారవ చేప



సదుంలోని కుమారుని ఒడ్డు చెరువులో గురువారం 12 కిలోల మారవ చేప దొరికింది. ఇక్కడి జాలర్ల వలకు ఈ పెద్ద చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా చూశారు. చెరువులో నీళ్లు మరింత తగ్గితే ఇంకా పెద్ద చేపలు దొరుకుతాయని తెలిపారు.

- సదుం

టమోటా ధరలు పతనం



టమోటా ధరలు భారీగా తగ్గు ముఖం పట్టాయి. గురువారం 15 కిలోల బాక్సు కేవలం రూ.300, 250కు చేరింది. నాణ్యత ఉన్న టమోటా 15 కిలోల బాక్సు 250 మాత్రమే పలికింది. మిగిలిన రకాలు రూ.200. వారం కిందట ఒక బాక్సు రూ.700, 800 పలికింది. శనివారం రూ.600కు, సోమవారం రూ.500, బుధవారం రూ.400కు గురువారం రూ.200కు చేరుకుంది. ఇలా రోజు రోజుకు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని టమోటా మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. అనంతపురం జిల్లా, ఇతర రాష్ట్రాల్లో టమోటా దిగుబడులు పెరిగి అక్కడ ధరలు తక్కువగా ఉండడంతో వ్యాపారులు అటు వెళ్లారు. దీంతో జిల్లాలోని మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు తెలిపారు.

- సోమల

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూలై 25: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,24,41,336 లభించింది. గురువారం ఆలయ ఆస్థాన మండపంలో కానుకలను ఈవో వెంకటేశు ఆధ్వర్యంలో లెక్కించారు. ఇందులో 1,256యూఎస్‌ఏ, 20 ఆస్ట్రేలియా, 4 సింగపూర్, 25 కెనడా డాలర్లు, 6 మలేసియా రింగిట్స్, 15 యూరోలు, 20 యూఏఈ దిర్హామ్స్, 10 ఇంగ్లండ్ పౌండ్లతో పాటు 24 గ్రాముల బంగారు, 440 గ్రాముల వెండి లభించింది. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.9,448, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.30,629 సమకూరినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, బాలరంగస్వామి, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి





న్యాయమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి - అర్ధగిరిలో తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

ఐరాల(కాణిపాకం)/తవణంపల్లె, జూలై 25: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డిలు స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కాగా అంతకు ముందు ఆమె తవణంపల్లె మండలం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలికి, స్వామి దర్శనం చేయించారు. శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

కష్టకాలంలో అండగా నిలిచిన మీ క్షేమమే మా కుటుంబ లక్ష్యం ● శాంతిపురం, రామకుప్పం మండలాల్లో భువనేశ్వరి పర్యటన

కుప్పం/శాంతిపురం/ రామకుప్పం, జూలై 25: రాష్ట్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం, అందుకే ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని నారా భువనేశ్వరి అన్నారు. కష్టకాలంలో చంద్రబాబుకు, టీడీపీకి అండగా నిలిచిన కుప్పం ఒక వరంలాంటిదన్నారు. అందుకనే నియోజకవర్గ ప్రజల క్షేమసమాచారాలు కనుక్కుని, వారికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమం అందించడానికి తాను స్వయంగా వచ్చానని చెప్పారు. మూడో రోజైన గురువారం ఆమె శాంతిపురం మండలంలోని సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లె.. రామకుప్పం మండలంలోని ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమల గ్రామాలలో పర్యటించారు. మహిళలలో ముఖాముఖి సమావేశమయ్యారు. ప్రజల క్షేమ సమాచారం తెలుసుకున్నారు. కుప్పం ప్రజలకు చంద్రబాబు ప్రత్యేక మ్యానిఫెస్టో ఇచ్చారని గుర్తు చేశారు. దానితోపాటు తన పర్యటనలో గమనించిన సమస్యలను ఆయనవద్ద ప్రస్తావించి పరిష్కారాలు చూపుతామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు చంద్రబాబు కష్టకాలంలో ఉన్నప్పుడు రోడ్డుమీదకు వచ్చి ఆందోళనలు చేసి ఆయనకు మద్దతు ప్రకటించడాన్ని తాను మరచిపోలేనన్నారు. వారికి ఆర్థిక స్వావలంబన కలిగించడానికి, వారి కుటుంబాలు బాగుపడడానికి తాను చంద్రబాబు ద్వారా వివిధ పథకాలు అమలు చేయిస్తానన్నారు. కుప్పంలో కార్గో విమానాశ్రయం పూర్తయితే పరిశ్రమలు వస్తాయన్నారు. వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలు తప్పుడు కేసులు బనాయించినా, మెడమీద కత్తిపెట్టినా ఏమాత్రం బెదరకుండా ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు చంద్రబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించారని గుర్తు చేసుకున్నారు. కుప్పం ప్రజల సమస్యలు పరిష్కరించడమే కాకుండా తమకు చేతనైనంతగా సాయం చేస్తానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. తన కుప్పం పర్యటన వెనుక ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాదు ఐటీని చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఆ రంగంలో ఎదిగిన ఐటీ నిపుణులు దేశవిదేశాలనుంచి వచ్చి చంద్రబాబు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయనకు మద్దతుగా నిలబడడం మరువలేని ఘట్టంగా భువనేశ్వరి పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేతలు డాక్టర్ సురేశ్‌బాబు, గాజుల ఖాదర్‌బాషా, గౌనివారి శ్రీనివాసులు, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ నామాలప్ప, యూనిట్ ఇన్‌ఛార్జి నాగభూషణంరెడ్డి, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, మునస్వామి, నరసింహులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురం మండలం బడుగుమాకులపల్లెలో మాట్లాడుతున్న భువనేశ్వరి

పంట పొలాలపై ఏనుగుల దాడులు

ఐరాల,జూలై 25: మండలంలోని వినాయకపురంలో గురువారం మూడు ఏనుగులు మామిడి, ఉసిరి తోటలపై దాడులు చేశాయి. రైతులు పార్వతమ్మ, అమ్ములు, రామకృష్ణారెడ్డికి చెందిన చెందిన మామిడి తోటలను ధ్వంసం చేశాయి. కంచె కూసాలు, బోరు పైపులు విరిచేశాయి. అపోలో ప్రతాప్.సి.రెడ్డికి చెందిన ఉసిరి చెట్లు విరిచివేశాయి. రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.



ధ్వంసం చేసిన కంచె, కూసాలు

రూ.27 లక్షల మద్యం, సారా ధ్వంసం



మద్యాన్ని నాశనం చేస్తున్న పోలీసులు

యాదమరి, జూలై 25: చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో సీజ్ చేసిన మద్యం, సారాను పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో యాదమరిలో 40, తవణంపల్లెలో 8, గుడిపాలలో 68 కేసుల మద్యం, 1,258 లీటర్ల సారాను పోలీసులు పట్టుకున్నారు. రూ. 27లక్షల విలువ చేసే ఈ మద్యం, సారాను చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో యాదమరి సమీపంలోని పెరుమాళ్లపల్లె వద్ద రోడ్డు రోలర్‌తో తొక్కించి నాశనం చేశారు. వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, సెబ్ ఏఈఎస్ రవి, యాదమరి ఎస్‌ఐలు రామాంజినేయులు, అనిల్‌కుమార్, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూలై 25: వరకట్నం కోసం భార్యను వేధించిన భర్తపై పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబులు నాగరాజ కథనం మేరకు..పుంగనూరులోని మేలుపట్లకు చెందిన శంకరప్ప కుమార్తె దివ్యభారతి(29)కి తమిళనాడు రాష్ట్రం మనవర్‌నగర్ పట్టణంలోని అన్ననగర్‌వీధికి చెందిన శేఖర్ కుమారుడు వినోద్‌కుమార్‌తో గత ఏడాది వివాహమైంది. ఇద్దరూ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. కొంత కాలంగా రూ.5లక్షలు అదనపు కట్నం కావాలని భర్త వేదిస్తున్నట్లు భార్య దివ్యభారతి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత కలెక్టరేట్‌లో భద్రతకు చర్యలు



కిటికీ లేని గదిని పరిశీలిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25: చిత్తూరు నగరం గిరింపేటలోని పాత కలెక్టరేట్‌ను డీఆర్వో పుల్లయ్య గురువారం సాయంత్రం సందర్శించారు. అక్కడి స్థితిగతులను పరిశీలించారు. 'ఇక్కడి రికార్డులకు భద్రత ఉందా' అంటూ గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో డీఆర్వో పాత కలెక్టరేట్‌కు వెళ్లి వందేళ్లకు మించి చరిత్ర కలిగిన రెవెన్యూ రికార్డు భవనాన్ని నాలుగువైపులా పరిశీలించారు. ప్రహరీకి ఏర్పడిన కంతను పూడ్చాలని, అద్దాలు, కిటికీలకు స్వల్ప మరమ్మతులు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. భవనంపై కూలేస్థితిలో ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించాలని ఆదేశించారు. పాత కలెక్టరేట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రౌండ్ ది క్లాక్ పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేయున్నారు. కలెక్టర్‌తో చర్చించి భద్రతాచర్యలు చేపడతామని డీఆర్వో తెలిపారు. రాత్రివేళల్లో మందుబాబులను అరికట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు అంశం చేపడతామన్నారు. బందెలదొడ్డిలా మారిన ట్రెజరీ రికార్డు గదిపై తగు చర్యలు తీసుకోవాలని ఖజానాశాఖ డీడీ రామచంద్రను ఆదేశిస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

చిత్తూరు (సెంట్రల్), జూలై 25: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై మైన్స్ అధికారులు దృష్టి సారించారు. మైన్స్ జియాలజిస్టు పోలిరెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి మూడు రోజులుగా పెనుమూరు, గంగాధరనెల్లూరు, యాదమరి మండలాల్లోని రీచ్‌లు, వంకల ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఎగువన కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని వాగులు, వంకలకు ఇసుక చేరింది. దీన్ని కొందరు వ్యక్తులు అనధికారికంగా తరలిస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. బుధవారం రాత్రి పెనుమూరు, యాదమరి మండలాల్లో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. దాడుల్లో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, రూరల్ సీఐ హరికృష్ణ, అర్బన్ సీఐ విజయ్‌కుమార్, మైన్స్ సిబ్బంది పాల్గొన్నారు. పోలిరెడ్డి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను తొలిసారి సీజ్ చేస్తూ రూ.10 వేలు, రెండోసారి రూ.25 వేలు జరిమానా విధిస్తామని, మూడోసారి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని తెలిపారు.



ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన మైన్స్ అధికారులు

విద్యార్థులకు పండ్లమొక్కల పంపిణీ



పలమనేరు, జూలై25 : పలమనేరు మండలంలోని దొడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పండ్లమొక్కలను పలమనేరు ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పంపిణీ చేశారు. జేటీడీ, బెంగళూరు యక్ష వారి సౌజన్యంతో 25 లక్నో రకం జామ, 10 సపోటా, 10 నిమ్మ, 5 అల్లనేరేడు మొక్కలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ మొక్కలను నాటి సంరక్షిస్తే ప్రతిసంవత్సరం వారికి మళ్లీ మరికొన్ని రకాల పండ్లమొక్కలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నేతాజి మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేటీడీ వలంటీర్ నవీన్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు సంపత్, భూదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అఖిలేష్ యాదవ్‌కు జగన్ అరాచకాలు ఏం తెలుసు?

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జూలై 25: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత అయిదేళ్లలో చేసిన అక్రమాలు, హత్యల గురించి ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌కు ఏమి తెలుసని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో జగన్‌రెడ్డి చేసిన నిరసనకు అఖిలేష్ మద్దతు తెలుపడాన్ని ఆయన ఖండించారు. దళిత డ్రైవర్‌ను, దళిత రైతులను, అక్కను వేధించవద్దని కోరిన తమ్ముడిని దారుణంగా హత్యలు చేయించినందుకు మద్దతు తెలిపారా అని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రంలోని ఎన్నో అక్రమాలు, అరాచకాలు, హత్యలు చేసిన జగన్ గురించి తెలుసుకుని తర్వాత మద్దతు గురించి తేల్చుకుంటే బావుంటుందని హితవు పలికారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు



జంతువధశాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, జూలై25 : మాంసం దుకాణదారులు తమ దుకాణాల వద్ద పారిశుధ్యం లోపించకుండా శుభ్రత పాటించాలని, జంతువుల అవశేషాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. గురువారం మాంసదుకాణాలను, జంతువధశాలను ఆయన తనిఖీ చేశారు. పట్టణంలో వీధికుక్కలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, వీధి కుక్కలకు మాంసం వ్యర్థాలను వేయరాదని స్పష్టంచేశారు.

సాయిబాబాకు పూజలు



కల్లూరు, జూలై 25: పులిచెర్లలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో ఆషాఢ పంచమి వేడుకలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకృతుడైన సాయినాథుడు విశేషంగా విశేషంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా మంగళంపేట కుంటావారిపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి కుటుం బసభ్యులు వ్యవహరించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ



పుంగనూరు రూరల్, జూలై25: పుంగనూరు ఉర్దూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా బీరువాను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు సద్దాం హుసేన్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల రికార్డులను భద్రపరచడానికి బీరువా వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆవరణలో సైకిల్‌స్టాండ్ ఏర్పాటు



పుంగనూరు రూరల్, జూలై25 : స్థానిక బసవరాజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1982-84లో చదివిన విద్యార్థి సహాయ సహకారాలతో సైకిల్‌స్టాండ్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ కమలాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన పూర్వ విద్యార్థి విజయభాస్కర్‌రాజు రూ.37,200లతో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఎస్ ఉద్యమ కేసులు ఎత్తేయడం హర్షణీయం

చిత్తూరు (సెంట్రల్), జూలై 25: సీపీఎస్ ఉద్యోగులు, టీచర్లపై పెట్టిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేయాలని ఉద్యమాలు చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం కేసులు నమోదు చేయించింది. వీటిని కూటమి ప్రభుత్వం ఎత్తివేయడంపై ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటా మోహన్, దేవరాజులు, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు రజనీబాబు, జిల్లా అధ్యక్షుడు మధు హర్షం వ్యక్తం చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కడా ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు నేడు ముగింపు

కుప్పం, జూలై 25: కుప్పం కడా కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు శుక్రవారం తుది గడువని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, వాచ్‌మెన్ పోస్టులు రెండేసి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ కడా అట్ ది రేట్ ఆఫ్ జీమెయిల్.కామ్ మెయిల్‌కు శుక్రవారం సాయంత్రం 6 గంటలవరకు వచ్చే దరఖాస్తులను స్వీకరిస్తామని తెలియజేశారు. తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి ఇంటర్వ్యూ నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పీడీ తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎస్‌కే



సీఎం చంద్రబాబుకు తాను నిర్మించిన ఆలయాల బుక్‌లెట్‌ను చూపిస్తున్న ఎస్‌కే వెంకటరమణారెడ్డి

చౌడేపల్లె, జూలై25: బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్‌కే వెంకటరమణారెడ్డి సీఎం చంద్ర బాబును కలిసి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. విజయవాడలో చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ, దక్షిణకాశీగా పేరొందిన అగస్త్యేశ్వర స్వామి ఆలయాలను మరింత అభివృద్ధి చేయాలని విన్నవించారు. అదేవిధంగా స్థానిక బజారు వీధిలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ రాజగోపురాన్ని సొంత నిధులతో నిర్మించానని ఆయనకు వివరించారు. అలాగే చౌడేపల్లె గ్రామదేవత చౌడేశ్వరీ దేవి ఆలయ జీర్ణోద్ధారణ చేశానని త్వరలో కలశస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఆలయాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎస్‌కే వెంకటరమణారెడ్డి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జూలై25: పుంగనూరు- బైరెడ్డిపల్లె మార్గంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పుంగనూరు మండలం సింగిరిగుంటకు చెందిన వెంకటప్ప(50) సొంత పనులపై కర్ణాటక రాష్ట్రానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అరవపల్లెకు చెందిన బాబుతో కలిసి ద్విచక్రవాహనంలో వస్తూ రాజుపల్లె వద్ద వాహనాన్ని నిలిపారు. అదేసమయంలో వెనక నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని అదుపుతప్పి ఢీకొంది. దీంతో వెంకటప్ప కాలికి గాయమైంది. చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముద్దచర్మ వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి పవన్‌కుమార్

చౌడేపల్లె, జూలై25: పశువులలో ముద్ద చర్మవ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పశువైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన చిట్రెడ్డిపల్లెలో పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. మండలంలోని 8000 టీకాలు పశువులకు వేసేందుకు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వ్యాధిసోకిన పశువులు అధిక జ్వరం బారినపడుతాయన్నారు. మేత సక్రమంగా తినవని, పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పులు కప్పిపుచ్చుకోవడానికే జగన్ ఢిల్లీ డ్రామా

చిత్తూరు సిటీ, జూలై 25: మాజీ సీఎం జగన్ తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలో ధర్నా డ్రామా ఆడారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ విమర్శించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన రాజకీయ హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలు, అరాచకాల గురించి ప్రజలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతో అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీలో వైసీపీ పాలనలో జరిగిన పాపాలు, అవినీతి, దోపిడీ, రాష్ట్రానికి జరిగిన నష్టం వివరాలతో విడుదల చేస్తున్న శ్వేత పత్రాలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పార్టీ నేతలు మోహన్‌రాజ్, మేషాక్, జాఫర్ పాల్గొన్నారు.

శాంతిపురం..పసుపుమయం

అడుగడుగునా భువనమ్మకు జన నీరాజనం ● వినతుల వెల్లువ





చీమనపల్లెలో భువనేశ్వరికి పసుపుపూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు, డ్వాక్రా మహిలలకు చెక్కు పంపిణీ చేస్తున్న భువనమ్మ

శాంతిపురం, జూలై 25: కుప్పం పర్యటనలో మూడవ రోజైన గురువారం నాడు నారా భువనేశ్వరి శాంతిపురం మండలంలోని పల్లెల్లో విస్తృతంగా పర్యటించారు. అంతకుముందు ఆమె కుప్పం పీఈఎస్‌లో ఆడిటోరియంలో ప్రజలనుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఆమెకు గ్రామ గ్రామాన ప్రజలు, మహిళలు అడుగడుగునా పువ్వులు చల్లుతూ, హారతులిస్తూ భువనేశ్వరికి నీరాజనాలు పలికారు. అక్కడినుంచి నేరుగా బయలుదేరి శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం వద్ద నిర్మాణంలో ఉన్న సొంత ఇంటి పనులను పరిశీలించారు. అనంతరం వెంకటాపురం మీదుగా సోమాపురం చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్ణకుంభాలతో మహిళలు స్వాగతం పలికారు. చీమనపల్లెలో వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఇక్కడినుంచి బయలుదేరి చిన్నకర్లగట్టలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. తర్వాత కర్లగట్ట గ్రామం లోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. అక్కడే మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. మొరసన పల్లె వద్ద భోజన విరామం తర్వాత బడుగుమాకులపల్లెలో జరిగిన మహిళల సమావేశంలో పాల్గొన్నారు. ప్రతిచోటా ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. దండికుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుప్పం లయన్స్ క్లబ్ ద్వారా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సాయిమాతా సేవాట్రస్టు కార్యక్రమాల గురించి ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు, భువనేశ్వరికి వివరించారు. సాయిబాబా చిత్రపటాన్ని బహూకరించి ఆమెను సత్కరించారు. అలాగే డిప్యూటీ ఇరిగేషన్ ఆఫీసర్ ప్రిలిమనరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు, మెయిన్స్ పరీక్షలు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు భువనేశ్వరికి విన్నవించారు. బడుగుమాకులపల్లె సభలో డ్వాక్రా సంఘాలకు రూ1.10 కోట్లు రుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేశ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు జయారెడ్డి, ప్రకాశ్, నాయకులు శ్రీరాములు, గిరిధర్, పెద్దన్న, ఆర్ఎస్.మణి, నాగభూషణం రెడ్డి, ఏఎంసీ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి పీవీ.నాగరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల, మహిళా నాయకులు వేదశ్రీ, రూప, సుగుణమ్మ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం రవాణా చట్టాన్ని రద్దు చేయాలి : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

పుంగనూరు, జూలై25: రవాణారంగ కార్మికులకు తీవ్ర నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం రవాణా బిల్లు తీసుకురావడం దారుణమని ఆ రవాణా బిల్లును చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం పుంగనూరులో జరిగిన ఆటోడ్రైవర్ల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా అమలు చేస్తున్న రవాణా చట్టం వల్ల రవాణా కార్మికుల నడ్డివిరుస్తోందని, ఆటో డ్రైవర్లు రోడ్డున పడుతున్నారని మండిపడ్డారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక ఆదాయం కలిగిస్తున్న రవాణారంగాన్ని నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిపై వేసిన జరిమానలు రద్దు చేసి, పుంగనూరులో ఆటో కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్న క్రమంలో ఆటోవాలాలకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రవాణా చట్టాన్ని రద్దు చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మురళీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఏర్పాటు

సీఐటీయూ పట్టణ అధ్యక్షుడిగా మస్తాన్, ప్రధాన కార్యదర్శి మౌలా, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నూర్, సహాయకార్యదర్శులుగా అహ్మద్‌బాషా, ప్రసాద్‌బాబు, కోశాధికారిగా ఇమ్రాన్‌తోపాటు 9మందిని కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు, జూలై25: కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు పి.అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముస్లింలపై బీజేపీ చిన్న చూపు చూస్తున్నట్లు కొంతమంది అనవసరంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం గత ఏడాది ముస్లింల అభివృద్ధి కోసం రూ.2,608.93 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 3,183.24 కోట్లు కేటాయించారని వివరించారు. గతంలో కేంద్రం మైనార్టీలకు కేటాయించిన నిధులను వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. సెక్యూరిటీ లేకుండా రూ.5లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకులు ముద్ర యోజన రుణాలు ఇస్తాయని ఈ రుణాలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

చెన్నమల్లయ్యతాత ఆలయంలో శాస్త్రోక్తంగా హోమాలు



భక్తిశ్రద్ధలతో సాగుతున్న కలశాల ఊరేగింపు

సోమల, జూలై 25: మండలంలోని కరకమంద చెన్నమల్లయ్య తాత ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా వేద పండితులు సుబ్ర మణ్యం శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చన, నవగ్రహ ఆరాధన, మూల మంత్ర జపాలు, హోమాది కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నడింపల్లె సర్పంచు వెంకటరమణ భక్తులకు అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్, మాజీ వైస్ ఎంపీపీ లలితమ్మ, ఎం.నారాయణ, శివమూర్తి, సాంబశివయ్య, ఎం.వాసుదేవకుమార్, చంద్రమౌళి, చెన్నమల్లయ్య, శ్యాంసుందర్‌బాబు, మునిరాజ, జయప్రకాశ్, గురుశంకర్, పెద్ద చంద్రయ్య తదితర ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ఈనెల 27వ తేదీ, 28వ తేదీల్లో ఎల్లమ్మ కొలుపు జాతర నిర్వహణ కోసం తిరుపతి రోడ్డు నుంచి కరకమంద వరకు భారీగా విద్యుత్ అలంకరణలు చేపట్టారు.

ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన ఏఎస్పీ



కల్లూరు, జూలై 25: పులిచెర్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా, సారా, బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రజల మన్ననలు సొంతం చేసుకోవాలన్నారు. స్టేషన్‌లోని సిబ్బంది పనితీరు మరింత మెరుగుపరచాలని, డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ శ్రీనివాసమూర్తి, ఎస్ఐ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సోమల, జూలై 25: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సోమల హైస్కూల్‌లో వివిధ రకాల వినోద కార్యక్రమాలు నిర్వహించారు. సోమల, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె, అడుసుపల్లె, సరస్వతీపురం, మేటిమంద, ఇరికిపెంటల్లో పాఠశాల్లో శిక్షాసప్తాహ్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, హెచ్ఎంలు ఎల్లయ్య, శోభారాణి, అమృత, లత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చల్లా సుప్రియారెడ్డికి తిరుమల ప్రసాదాలు



రొంపిచెర్ల, జూలై25: పులిచెర్ల మండల టీడీపీ నాయకులు తిరుమలకు పాదయాత్రగా వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని శ్రీవారి ప్రసాదాలను నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సతీమణి మాజీ సర్పంచ్ సుప్రియారెడ్డికి గురువారం అందజేశారు. నాయకులు గోపీనాయుడు, పరంధామ నాయుడు, సురేంద్ర, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, జూలై25: విద్యతోనే వికాసం అని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం 'నేస్తం' ఫౌండేషన్ వ్యవస్థాపకులు గువ్వల కేశవరెడ్డి సహకారంతో రూ.1.50లక్షల విలువైన పుస్తకాలను మండలంలోని తెల్లనీళ్లపల్లె, నాగిరెడ్డిపల్లె, బత్తలాపురం, సామిరెడ్డిపల్లె, మల్లెలవారిపల్లె, పరిగిదొన, సింగిరిగుంట పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి రామకుప్పం జననీరాజనం



ఆవులకుప్పంలో గజమాలతో నారా భువనేశ్వరాకి ఘనస్వాగతం

రామకుప్పం, జూలై 25: కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా గురువారం రామకుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి నారాభువనేశ్వరికి గ్రామగ్రామాన జనం నీరాజనం పలికారు. మండలంలోని ఆవులకుప్పం గ్రామంలో టీడీపీ శ్రేణులు ఆమెకు గజమాలతో స్వాగతం పలికారు. ఆమె రాక కోసం ఎదురుచూస్తున్న ముద్దనపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆమె కాసేపు ముచ్చటించి, వారితో ఫొటో దిగారు. అదేవిధంగా నారాయణపురంతాండా, ఆరిమానిపెంట, వీర్నమల గ్రామాల్లో కూడా టీడీపీ శ్రేణులు, మహిళలు భువనేశ్వరికి ఘనస్వాగతాలు పలికారు. వీర్నమలలో ఆమె లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు, స్థానిక మహిళలు ఆమెకు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. ఆవులకుప్పం, నారాయణపురంతాండా, ఆరిమానిపెంట, వీర్నమలల్లో ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక, అవినీతి పాలనను ఆమె మహిళలకు గుర్తు చేస్తూ, రాష్ట్రంలో టీడీపీ కూటమికి ఘన విజయం చేకూర్చిన మహిళలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మూడున్నర దశాబ్దాలుగా కుప్పంలో చంద్రబాబును గెలిపించిన ప్రజలకు తమ కుటుంబం ఎంతో రుణపడి ఉందని ఆమె తెలిపారు. తాను, సీఎం చంద్రబాబు అన్ని వేళలా కుప్పం ప్రజలకు అండగా ఉంటూ రుణం తీర్చుకుంటామన్నారు. ఈ సమా వేశాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధానకార్యదర్శి నరసింహులు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నకృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు సీతాపతి, రామ్మూర్తి, కృష్ణానాయక్, జయశంకర్, నందారెడ్డి, మనోహర్, చంద్రశేఖర్ రెడ్డి, సత్తి, మహ్మద్‌రఫీ, లోకేష్, గజేంద్ర, పాండియన్, రాజారం, రామునాయక్, జేయి, భూపతి పాల్గొన్నారు.



ముద్దనపల్లె ఉన్నతపాఠశాల విద్యార్థులతో భువనేశ్వరి

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నిధుల మళ్లింపుపై విచారణ చేపట్టాలి



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ఐరాల, జూలై 25: గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేష్‌రెడ్డి, టీడీపీ నాయకుడు సాయీశ్వర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. సర్పంచ్ భర్త తప్పుడు బిల్లులు, ఎక్కువ కొటేషన్లు వేసి పంచాయతీ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. దీనిపై రీఆడిట్ చేసి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో వారు ఈ మేరకు డిమాండ్ చేశారు. సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పాఠశాలల్లో డీఈవో తనిఖీలు



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో దేవరాజ్

తవణంపల్లె, జూలై 25: మండలంలోని అరగొండ బాలుర, బాలికల పాఠశాలను డీఈవో దేవరాజ్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యత పెంచాలని సూచించారు. అరగొండ అపోలో ఇషా పాఠశాలను తనిఖీ చేసి, యూడైస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరికి పీహెచ్ మేస్త్రీలుగా పదోన్నతి



చినబాబుకు పదోన్నతి పత్రం ఇస్తున్న మేయర్

చిత్తూరు, జూలై 25: నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో ఇద్దరికి పీహెచ్ మేస్త్రీలుగా పదోన్నతి పత్రాలను మేయర్ అముద గురువారం అందించారు. సీనియారిటీ జాబితా ప్రకారం కమిషనర్ అరుణ కౌన్సెలింగ్ నిర్వహించారు. పీహెచ్ వర్కర్లుగా ఉన్న బాబు, చినబాబులకు పీహెచ్ మేస్త్రీలుగా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను మేయర్ అందించారు. మేనేజర్ గోపాలకృష్ణవర్మ పాల్గొన్నారు.

లోటు బియ్యాన్ని రికవరీ చేయండి

గుడిపాల, జూలై 25: గత ప్రభుత్వ హయాంలో రేషన్ డీలర్ల వద్ద ఒకటి నుంచి ఒకటిన్నర టన్ను బియ్యం కొరత వచ్చిందని, వాటిని రికవరీ చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ అధికార ప్రతినిధి తుమ్మల సాంబశివనాయుడు కోరారు. పాత డీలర్లు చేసిన అక్రమాలకు కొత్త వారిని బాధ్యులను చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.

కృత్తిక వేడుకలకు కందగిరి ఆలయం ముస్తాబు



గుడిపాల, జూలై 25: మండలంలోని కందగిరి కొండపై వెలిసిన వల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 28, 29 తేదీల్లో ఆడికృత్తిక వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కావళ్లు తెచ్చి మొక్కులు చెల్లించే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, కమిటీ సభ్యులు తెలిపారు.

పాత ఇండ్లకు నిధుల మంజూరుపై హర్షం

గుడిపాల, జూలై 25: టీడీపీ హయాంలో నిర్మాణంలో ఉండి, ప్రభుత్వం మారడంతో ఆగిపోయిన ఇళ్లకు నిధులు మంజూరు చేయడంపై టీడీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, తెలుగు యువత మండల అధికార ప్రతినిధి బాలసుబ్రహ్మణ్యం యాదవ్, నాగరాజయాదవ్, ఏకాంబరం యాదవ్, నిత్యానందం హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనుల కింద రూ.40 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమన్నారు.

రేపు కోదండరామాలయ దుకాణాల వేలం

చిత్తూరు కల్చరల్, జూలై 25 : స్థానిక కోదండరామాలయానికి చెందిన 13 దుకాణాలు, రెండు ఇళ్లను మూడు సంవత్సరాల అద్దెకు గాను శనివారం ఉదయం ఆలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పిళ్లారి గుడి వీధిలో రెండు, చర్చివీధిలో నాలుగు, రాములగుడి వీధిలో మూడు, బజారు వీధిలో రెండు, దొంగలబావి వీధిలో రెండు షాపులు, ఖాజీ వీధిలో రెండు నివాస గృహాలకు వేలం నిర్వహిస్తున్నామని, దేవాదాయశాఖ నిబంధనలను అనుసరించి కేటాయిస్తామని పేర్కొన్నారు.

28న ఉచిత నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, జూలై 25: రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సుభాష్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైస్కూల్ ప్లస్ పేరు మార్చండి

చిత్తూరు (సెంట్రల్), జూలై 25: హైస్కూల్ ప్లస్‌లను జెడ్పీ జూనియర్ కళాశాలలుగా పేరు మార్చాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేష్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం అమరావతిలో స్కూల్ ప్లస్ జేడీ వీఎస్ సుబ్బారావును కలిసి వినతిపత్రం అందజేశారు. హైస్కూల్ ప్లస్‌లో కోఎడ్యుకేషన్ పెట్టాలని, మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, గ్రాడ్యుయేట్ టీచర్స్‌ను జేఎల్‌గా సర్వీసు క్రమబద్ధీకరించాలని కోరారు.

గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ జీతాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

విజయపురం, జూలై 25: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. విజయపురంలో గురువారం ఏఐటీయూసీ కార్మిక అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం మండలాధ్యక్షుడు ఏసుపాదం అధ్యక్షతన నిర్వహించారు. కోదండయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జీతాలు పెంచాలన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ అధ్యక్షురాలు సుజాత, నాయకులు పరిమళ, లక్ష్మి, లత, షీబా, భావన, మునిలక్ష్మి, రవి, సుధాకర్, ఏలుమళై పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో జన్మదిన వేడుకలా..

గుడిపాల, జూలై 25: వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి జన్మదిన వేడుకలను ప్రభుత్వ పాఠశాలలో జరపడం సరికాదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విమర్శించారు. అవినీతి అక్రమాల జాబితాలో ఉన్న వ్యక్తులను విద్యార్థులకు పరిచయం చేస్తే వారి భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గణిత అవధానం మేధస్సును పెంచుతుంది



గణిత అవధాన విద్యార్థులకు సన్మానం

చిత్తూరు (సెంట్రల్), జూలై 25 : గణిత అవధానం మేధస్సును పెంచుతుందని ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ పేర్కొన్నారు. మ్యాథ్స్ ఫోరం, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా గురువారం ఎస్‌పీఎస్ కళాశాలలో గణిత అవధాని అరుణశివప్రసాద్ శిష్యబృందంతో 25వ గణిత ప్రజ్ఞాదారణ కార్యక్రమం నిర్వహించారు. బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులు పునీత్, లహరి, హేమ, రేవతిలు పది విభాగాల్లో 200 సంఖ్యల అవధానం చేశారు. సంఖ్యా క్రమంలో చేపట్టే అవధానం మేధస్సుకు పదును పెట్టిందని పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం గణిత అవధాన విద్యార్థులను సన్మానించారు. గణిత శాఖాధ్యక్షులు శోభలత, జేవీవీ కార్యదర్శి సుధాకర్ నాయుడు, మ్యాథ్స్ ఫోరం అధ్యక్షుడు చంద్రంనాయుడు, కళాశాల అధ్యాపకులు ఉషారాణి, రమాదేవి, గంగారాం, శ్రీధర్, జయంతి, మొగిలయ్య, పద్మావతి పాల్గొన్నారు.

తప్పులు కప్పిపుచ్చుకోవడానికే జగన్ ఢిల్లీ డ్రామా



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, జూలై 25: మాజీ సీఎం జగన్ తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలో ధర్నా డ్రామా ఆడారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ విమర్శించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన రాజకీయ హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలు, అరాచకాల గురించి ప్రజలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతో అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీలో వైసీపీ పాలనలో జరిగిన పాపాలు, అవినీతి, దోపిడీ, రాష్ట్రానికి జరిగిన నష్టం వివరాలతో విడుదల చేస్తున్న శ్వేత పత్రాలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పార్టీ నేతలు మోహన్‌రాజ్, మేషాక్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



చిత్తూరు సిటీ, జూలై 25: జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం పీసీఆర్ సర్కిల్‌లో చేపట్టారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆరణి కవిత మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందన్నారు. యువత ఎక్కువగా పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 900 సభ్యత్వాలు నమోదయ్యాయని వెల్లడించారు. పార్టీ నేతలు ఏకే శరవణ, మురళి, ధీరజ్, వినోద్, ఆరణి అంజలి, వనిత,యుగంధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



కార్వేటినగరం, జూలై 25: అలత్తూరు పంచాయతీ కేంద్రంలో రోడ్డుపైనే మురికినీరు ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పైగా అవి దుర్వాసన వస్తుండడంతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా నీవానది వంతెన







జాయింట్ల వద్ద కనిపిస్తున్న కమ్మీలు - బ్రిడ్జి పైభాగంలో కూలిపోయిన సేఫ్టీవాల్ - బ్రిడ్జి ప్రారంభంలో ఏర్పడిన గుంతలు

- జాయింట్ల వద్ద ఊడిపోయిన సిమెంట్ పెచ్చులు
- ఆందోళనలో వాహనదారులు

గంగాధరనెల్లూరు, జూలై 25: గంగాధరనెల్లూరులోని నీవానది బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. జాయింట్ల వద్ద సిమెంట్ పెచ్చులు ఊడిపోయి, కమ్మీలు, బోల్ట్‌లు దర్శనమిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గంగాధరనెల్లూరుకు సమీపంలో నీవానది ప్రవహించే చోట (చిత్తూరు - పుత్తూరు రహదారి) 20ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. నిన్న మొన్నటి వరకు ఈ బ్రిడ్జి పటిష్టంగానే కనిపించింది. మండలంలో రెండేళ్లకు పైగా చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. బాలగంగనపల్లె, వరత్తూరు, వేపంజేరి, చిన్నవేపంజేరి, ముక్కళత్తూరు పంచాయతీల పరిధిలో జరుగుతున్న పనులకు అవసరమైన ఇసుక, కంకరరాళ్లు, జల్లి భారీ టిప్పర్లలో హెవీ టన్నేజి లోడ్‌తో బ్రిడ్జిపై నుంచే తీసుకెళుతున్నారు. తద్వారా పిల్లర్‌కు, పిల్లర్‌కు మధ్య గల జాయింట్ల వద్ద సిమెంట్ పెచ్చులు ఊడిపోయి, కమ్మీలు, బోల్ట్‌లు నాలుగైదు చోట్ల దర్శనమిస్తున్నాయి. మోల్డింగ్‌లో నుంచి కమ్మీలు వెలుపలకు వచ్చేయడం వల్ల బ్రిడ్జిపై రాకపోకలు సాగించే వాహనాల టైర్లకు గుచ్చుకుని పంక్చర్లు అవుతున్నాయి. పైగా భారీ టన్నేజి లోడ్‌లతో టిప్పర్ లారీలు రాకపోకలు సాగిస్తే బ్రిడ్జి ఇంకెంత డ్యామేజ్ అవుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి జాయింట్లపై దృష్టి సారించి, హెవీ లారీల రాకపోకలు నిషేధించాలని కోరుతున్నారు.

సీఎం పర్యటన అర్జీలు త్వరగా పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25: గత నెల చివర్లో కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు అందిన వేలాది వినతిపత్రాలను త్వరగా పరిష్కరించాలని డీఆర్వో పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆయన జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అర్జీల పరిష్కారానికి బృందాలను ఏర్పాటు చేసి, పరిష్కారానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్జీదారుడికి తగిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్, ఏఎస్పీ అరీఫుల్లా, జడ్పీ సీఈవో గ్లోరియా, పీఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, డీఎల్‌డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



తవణంపల్లె, జూలై 25: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. తిరుపతి-బెంగళూరు హైవేపై బాహుదానది వంతెన వద్ద సర్వీసు రోడ్డుపై నడిచి వెళుతుండిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిస్తే తవణంపల్లె పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

జేజేఎం పథకం అమలుకు సహకరించండి



పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూలై 25: రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని అమలు చేసేందుకు సహకారం అందించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో జేజేఎం పథకానికి సంబంధించిన వివరాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు, అవి ఏ మేరకు అమలయ్యాయి అనే వివరాలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది మహిళలు మూడు కిలోమీటర్లు నడచి తాగునీరు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. జేజేఎం పథకం రాష్ట్రానికి ఎంతో అవసరమని చెప్పారు.

చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోండి



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

చిత్తూరు సిటీ, జూలై 25 : జిల్లా మైనారిటీ అధికారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ నేతలు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డికి గురువారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పెనుమూరు క్రాస్‌లోని మైనార్టీ బాలికల పాఠశాల, వసతి గృహ ఆవరణలో బుధవారం వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి జన్మదిన వేడుకలను అనుమతిచ్చిన జిల్లా మైనార్టీ అధికారి చిన్నారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో నిందితుడిగా ఉన్న విజయానంద రెడ్డి జన్మదిన వేడుకలకు స్మగ్లర్లు, రౌడీ షీటర్లు పాఠశాలలోకి వచ్చి ప్రిన్సిపాల్‌ను, ఉపాధ్యాయులను, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. చిన్నపిల్లల చేత రాజకీయ నాయకులకు జిందాబాద్‌లు కొట్టించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు నగర అధ్యక్షుడు ప్రభుతేజ, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గోకుల్ ఆదిత్య, జిల్లా కార్యదర్శి జీవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంబేడ్కర్ సంఘం నేతలు

నగరి, జూలై 25: బీఎస్పీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు నిరసనగా నగరిలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆలిండియా అంబేడ్కర్ సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు ఎంకే ప్రకాష్ మాట్లాడుతూ తమ నాయకుడిని నరికి చంపిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. వీసీకే రాష్ట్ర ఇన్‌చార్జి బాలసింగం మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ సాగింది. అంబేడ్కర్ సంఘ జాతీయ కార్యదర్శి గోవింద స్వామి, జిల్లా అధ్యక్షుడు వేలాయుధం, మహేష్, నాయకులు బాలవర్ధనరాజు, విజయచందర్, ఉమాపతి, బాబు, నాగరాజు, మధు, బీఎస్పీ నగరి ఇన్‌చార్జి నాగూర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంఅండ్‌హెచ్‌వో తనిఖీలు



యాదమరి, జూలై 25 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ ప్రభావతి గురువారం యాదమరి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సమీపంలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. కాన్పుల వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో కొత్తది ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ సురేఖ ఆమె దృష్టికి తెచ్చారు. ఫార్మసీ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం యాదమరిలో జరుగుతున్న లెప్రసీ సర్వేను పరిశీలించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం, జూలై 25: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మంగుంటలో గురువారం యాజమాన్య పద్ధతులు, పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రసాయనిక పురుగు మందులు, ఎరువులకు బదులు వేపగింజల కషాయం, కానుగాకు లాంటివి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వేరుశనగలో అంతర పంటల సాగుపై అవగాహన కల్పించారు. సరిహద్దు పంటగా జొన్న లేదా సజ్జ, అంతర పంటగా కంది వేయాలని సూచించారు. తద్వారా వేరుశనగకు చీడ పురుగుల బెడద తప్పుతుందన్నారు. ఎకరాకు 200 బస్తాల జిప్సం వేస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చన్నారు.

నేడు రెండో శుక్రవార పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 25: ఆడి(ఆషాడ) మాసం రెండో శుక్రవారం సందర్భంగా నగరంలోని అంకాల పరమేశ్వరి, కనకదుర్గాలయం, దుర్గాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

సీపీఎస్ ఉద్యమ కేసుల ఎత్తివేత నిర్ణయంపై హర్షం

చిత్తూరు (సెంట్రల్), జూలై 25: సీపీఎస్ ఉద్యోగులు, టీచర్లపై పెట్టిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయాలని నిర్ణయించడంపై ఉపాధ్యాయ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేయాలని ఉద్యమాలు చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం కేసులు నమోదు చేయించింది. వీటిని కూటమి ప్రభుత్వం ఎత్తివేయాలని నిర్ణయించడంపై ఎస్టీయూ నాయకులు గంటా మోహన్, దేవరాజులు, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు రజనీబాబు, మధు హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్వేటినగరం, జూలై 25: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్త్రీ సాధికారిత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై డీఎంపురం హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్‌ఎం కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



నగరి, జూలై 25: టీఆర్‌కండ్రిగ వద్ద గల షిరిడీస్ దివ్యాంగుల పాఠశాలలో ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వారు గురువారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ట్రస్టు ఫౌండర్ ప్రభాకర్‌రెడ్డి, ట్రస్టీలు ఇప్రభాకర్‌రెడ్డి, మోహనలక్ష్మిలు పాల్గొని దివ్యాంగులకు స్వయంగా భోజనం వడ్డించారు.

గిరిజన కాలనీల్లో మెడికల్ క్యాంపులు

నగరి, జూలై 25 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన కాలనీలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ నగరి, నిండ్ర, విజయపురం మెడికల్ సూపరింటెండెంట్లకు లేఖ రాశారు. నల్సా 2015 పథకం కింద ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సమన్వయంతో క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు నిండ్ర మండలం వేదాంతపురం ఎస్టీకాలనీ, 9 గంటలకు విజయపురం మండలం ఎల్లసముద్రం ఎస్టీకాలనీ, 10 గంటలకు నగరి మండలం నెత్తంకండ్రిగ ఎస్టీ కాలనీలలో మెడికల్ క్యాంపులకు ఏర్పాట్లు చేయాలని, స్థానికులతో సమావేశం నిర్వహించాలని సూచించారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

బంగారుపాళ్యం, జూలై 25: దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ సీనియర్ నేత మహేంద్ర కోరారు. మండలంలోని గుండ్లకట్టమంచి, తంబుగానిపల్లి, జిల్లేడుపల్లి, 65 వెంకటాపురం, మహాసముద్రం, బోడబండ్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు ఆధ్వర్యంలో జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కల్యాణ్ గురువారం విద్యా సామగ్రి వితరణ చేశారు. మహేంద్ర మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించండి

పాలసముద్రం, జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిద్దెనత్తం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. మౌలిక వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. మరుగుదొడ్ల వసతి సక్రమంగా లేదని హెచ్‌ఎం పావని ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు.

రేపు జాబ్‌మేళా

పాలసముద్రం, జూలై 25: మండలంలోని రేవా రిసార్ట్‌లో శనివారం అమరరాజా బ్యాటరీస్ సంస్థ, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు పేర్కొన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగం పొందాలని కోరారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ పాస్ / ఫెయిల్ అయిన విద్యార్థులు, 18-35 ఏళ్ల లోపు నిరుద్యోగులు బయోడేటా, సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూలో పాల్గొనాలని కోరారు. భోజన వసతి కల్పించామని తెలిపారు.